ప్రభుత్వం వైపే ప్రజలు : షబ్బీర్ అలీ



ఎర్రగడ్డ నూర్ మజీద్ వద్ద ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ



హెచ్.ఎఫ్.నగర్ ఫేజ్-2లో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్, బస్తీ అధ్యక్షుడు ఎం.డి.జాఫర్ హుస్సేన్

ఎర్రగడ్డ/బోరబండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం వైపే ప్రజలు ఉన్నారని ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డలోని నూర్ మసీదు వద్ద ఆయన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత సన్న బియ్యం, ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల జారీ తదితర పథకాలను అమలు చేస్తుండడం వల్ల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్ పెంచేలా ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల కాంగ్రెస్ నాయకులు కేకే మహేందర్‌రెడ్డి, ఎంఆర్ఎం విద్యాసంస్థల అధినేత మహ్మద్ హబీబుద్దీన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నయీముద్దీన్, మహ్మద్ మోసిన్ ఖురేషి, ఆకాష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ కార్పొరేటర్ కంజర్ల



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కంజర్ల సదాశివ యాదవ్

ఎర్రగడ్డ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్ మాజీ కార్పొరేటర్, బీజేపీ నాయకుడు కంజర్ల సదాశివ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో శుక్రవారం తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సదాశివ యాదవ్ 2009 నుంచి 2014 వరకు ఎర్రగడ్డ డివిజన్ కార్పొరేటర్‌గా పనిచేశారు. ప్రస్తుతం బీజేపీలో సనత్ నగర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత కొన్ని రోజులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసులు ఆయనతో చర్చలు జరిపారు. దీంతో సదాశివ యాదవ్ పార్టీ మారేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ గెలుపు కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా కంజర్ల సదాశివ యాదవ్ తెలిపారు. పార్టీలో చేరిన వారిలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు కొయ్యాడ రాజ్ కుమార్‌గౌడ్, చలపతిరావు, సాయినిఖిల్ యాదవ్, దేరంగుల శ్రీనివాసరావు, ధీరజ్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లోకి..



రహ్మత్ నగర్‌లో ప్రచారం చేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్

నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అన్నారు. ఎర్రగడ్డలో ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త ఆర్‌వీఎస్ఎస్ఎన్ రాజు, తారంగ అపార్ట్‌మెంట్ ప్రెసిడెంట్ హరికృష్ణరాజు, హరికృష్ణకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్ రాజు, రజనీకాంత్, బాపయ్య చౌదరి, మిస్బా, పుల్లయ్య, రాఘవయ్య పాల్గొన్నారు.



ఎర్రగడ్డలో ప్రచారం చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన



వస్త్ర ఉత్పత్తులతో మంజు అగర్వాల్

బంజారాహిల్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డునెంబర్.12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన 2025ను శుక్రవారం సోషలైట్ మంజు అగర్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటి తరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని అన్నారు. నిర్వాహకులు జయేష్‌గుప్తా మాట్లాడుతూ నవంబరు 4వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతిపని బృందాలు తమ సిల్క్ హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు.

బీఆర్ఎస్ అభ్యర్థిపై కేసు నమోదు

బోరబండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందుకు జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ సుల్తాన్ నగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో బీఆర్ఎస్ అభ్యర్థి పేరు, ఫొటో ఉన్న ఓటరు గుర్తింపుకార్డు ప్రతులను నాయకులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్డుల పంపిణీని గుర్తించిన కాంగ్రెస్ నాయకులు బోరబండ ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీనిపై న్యాయస్థానం సూచన మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడు వెంకట్ యాదవ్, అతడి అనుచరులు దౌర్జన్యం చేశారన్న ఫిర్యాదును బోరబండ పోలీసులు కోర్టు పరిశీలనకు పంపించారు. కోర్టు సూచన ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

మాలలకు అన్యాయం చేసిన వారిని ఓడించండి

బోరబండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జీవో 99 ద్వారా తెలంగాణలో అత్యంత వెనకబడిన మాలల్లోని 58 కులాలకు తీరని అన్యాయం జరుగుతోందని మాల సంఘాల జేఏసీ జూబ్లీహిల్స్ అభ్యర్థి బేర బాలకిషన్ తెలిపారు. బోరబండ, రహ్మత్ నగర్ డివిజన్ పరిధిలో జేఏసీ ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ ఉప ఎన్నికల్లో మాల సంఘాల జేఏసీ తరఫున పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. సీఎం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందల భాస్కర్, గౌరవ చైర్మన్ చెరుకు రామచందర్, అంజయ్య, భీమ్‌సేన, రాహుల్‌రావు, నల్లాల కనకరాజు పాల్గొన్నారు.



ఎస్పీఆర్ హిల్స్‌లోని దళిత అధ్యయన కేంద్రాన్ని సందర్శించిన బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు

దళిత అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించాలి

బోరబండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లోని దళిత అధ్యయన కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. అధ్యయన కేంద్రాన్ని శుక్రవారం మాజీ మంత్రులు టి.రాజయ్య, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు విజయుడు, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, ఎర్రోళ్ల శ్రీనివాస్, పార్టీ నాయకులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, బొమ్మెరి రామ్మూర్తి, నివేదిత, గజ్జెల నగేశ్, రాజీవ్ సాగర్ తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణం పూర్తయి రెండేళ్లవుతున్నా అధ్యయన కేంద్రం ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫ్లాష్‌మాబ్‌తో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది

బంజారాహిల్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించేందుకు అపోలో క్యాన్సర్ హాస్పిటల్, క్యూర్ ఫౌండేషన్ సంయుక్తంగా బంజారాహిల్స్‌లోని జీవీకే వన్ మాల్‌లో శుక్రవారం ఫ్లాష్‌మాబ్ డ్యాన్స్ నిర్వహించారు. "చెక్.కేర్.క్యాన్సర్‌పై" అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డ్యాన్స్ చేస్తూ ఆకట్టుకున్నారు. సినీనటుడు, గుండె నిపుణుడు డాక్టర్ భరత్‌రెడ్డి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అపోలో క్యాన్సర్ సెంటర్స్ డైరెక్టర్, క్యూర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.పి.విజయ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్‌పై ఉన్న భయాలను, అపోహలను తొలగించేందుకు ప్రజల్లోకి వచ్చి ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మహిళలు క్రమం తప్పకుండా స్ర్కీనింగ్ చేయించుకోవడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొలన్ సత్యనారాయణ



సత్యనారాయణకు నియామక పత్రం ఇస్తున్న కిషన్‌రెడ్డి

బోరబండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రహ్మత్ నగర్‌కు చెందిన కొలన్ సత్యనారాయణ నియమితులయ్యారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆయనకు శుక్రవారం నియామకపత్రం అందజేశారు. పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్న కొలన్‌ను సెంట్రల్ జిల్లా కార్యదర్శి పదవికి ఎంపిక చేయగా ఆయన నిరాకరించారు. అంతేగాకుండా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ నేతలు, ప్రముఖులు పాల్గొన్న ప్రచారానికి కూడా దూరంగా ఉన్నారు. దీంతో అధిష్ఠానం ఆయనను బుజ్జగిస్తూ ఉపాధ్యక్ష పదవిని అప్పగించింది. జూబ్లీహిల్స్ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి విజయానికి శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా సత్యనారాయణ తెలిపారు.

అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 'విజిలెన్స్ అవగాహన' వారోత్సవాలు నిర్వహించారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ పిలుపు మేరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా అవినీతికి వ్యతిరేకంగా శుక్రవారం జూబ్లీహిల్స్ క్యాంపస్‌లో ఉద్యోగులంతా ప్రతిజ్ఞ చేశారు. తమ కార్యాలయంలో లంచానికి, అవినీతికి తావు లేదని, తాము లంచం తీసుకోమని, ఇతరులకు లంచం ఇవ్వమని ప్రతిజ్ఞ చేశారు. ఇటు కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు అటు ప్రజలు అవినీతికి వ్యతిరేకంగా పనిచేయాల్సిన అవసరముందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ.ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.ఎల్.విజయ్‌కృష్ణారెడ్డి ఉద్యోగులతో అవినీతికి వ్యతిరేకంగా, కార్యాలయాల్లో తమ విధులను పారదర్శకతతో నిబద్ధతగా నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అన్ని విభాగాల డైరెక్టర్లు, డీన్లు, బోధన, బోధనేతర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ మాజీ ఎంపీ ఇంట్లో వజ్రాభరణాలు చోరీ

బంజారాహిల్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు ఇంట్లో చోరీ జరిగింది. జూబ్లీహిల్స్‌లోని నివాసంలో రామ్మోహన్‌రావు ప్రతీ ఏడాదిలానే ఈ సంవత్సరం సెప్టెంబరు 22న నవరాత్రుల పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి బంగారు గొలుసులు, వజ్రాలతో పొదిగిన మూడు వరుసల వంకీలు అలంకరించారు. అక్టోబరు 2న పూజ సమయంలో ఒక వజ్రాల బంగారు వంకీ కనిపించలేదు. ఇంట్లో అంతా వెతికినా కనిపించేదు. దీంతో పూజ నిర్వహించిన సమయంలో ఇంట్లో పనిచేసే వారు తీసి ఉంటారని అనుమానిస్తూ ఈనెల 28న ఆయన వ్యక్తిగత సహాయకుడు వల్లమల్ల శ్రీకాంత్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందరి మనస్సు గెలిచిన అమ్మపాట

బంజారాహిల్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అమ్మపాట అందరి మనస్సును గెలుచుకుందని సినీనటి శ్వేతావర్మ అన్నారు. గాయని జాహ్నవి పాడిన అమ్మపాట 100 మిలియన్ వ్యూస్ పూర్తి చేసుకోవడంతో శుక్రవారం ఫిలింనగర్‌లో విజయోత్సవ వేడుక నిర్వహించారు. శ్వేతావర్మ మాట్లాడుతూ అమ్మ అనే మాటలో ఉన్న కమ్మదనాన్ని జాహ్నవి పాట రూపంలో చూపించిందన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయేన్సర్లు జాహ్నవిని అభినందించారు.

ప్రెసిడెంట్ కప్ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్-2025 పోటీలు

పంజాగుట్ట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల మనల్ని మనం రక్షించుకోవడమే కాకుండా శారీరక, మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటోకాన్ ఇండియా ఆధ్వర్యంలో నవంబరు 15, 16వ తేదీల్లో ప్రెసిడెంట్ కప్ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్-2025 పోటీలు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఫెడరేషన్ అధ్యక్షుడు గణేష్ గడియారం, కేఎఫ్ఎస్ రాష్ట్ర చైర్మన్ పి.రామకృష్ణారావు, కె.కృష్ణారెడ్డి, లయన్ కె.శ్రీనివాస్ రెడ్డి, జి.శేఖర్‌రెడ్డితో కలిసి శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

నాటి ప్రశ్నించే గొంతుక... నేడు సమాధానం చెప్పాల్సిన తరుణం

బోరబండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నాటి ప్రశ్నించే గొంతుక నేడు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. 'మాట ముచ్చట' కార్యక్రమంలో భాగంగా బోరబండ సైట్-3లోని ఫేమస్ టీ పాయింట్‌లో శుక్రవారం చాయ్ ప్రియులతో మాట్లాడారు. అనంతరం జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్‌తో కలిసి సాయిబాబా నగర్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాగొంతుకగా జనం గెలిపించారని, అప్పుడు చేసిన వాగ్దానాలు ఎందుకు నెరవేర్చలేదో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్ హయాంలో ప్రజలకు చేతినిండా పని, కంటినిండా నిద్ర, కడుపునిండా తిండి ఉండేవని, నేడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో అవన్నీ కరువయ్యాయని దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల పార్టీ మారిన కార్యకర్తలను కలిసిన ఎమ్మెల్యే వారిని బుజ్జగించే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ బోరబండ డివిజన్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్, ఎన్.విజయ్ కుమార్ పాల్గొన్నారు. మాగంటి సునీతకు మద్దతుగా బోరబండ డివిజన్‌లో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి ప్రచారం చేశారు. 'మాట ముచ్చట' కార్యక్రమంలో భాగంగా రహ్మత్ నగర్‌లో మాజీ మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు.



బోరబండలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత

రహ్మత్‌నగర్ కూడలిలో అమర్ టీ పాయింట్ వద్ద మాట ముచ్చటలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. ఉపఎన్నికలో మైనారిటీలను మభ్యపెట్టడానికి మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్‌పర్సన్ రజినీసాయిచంద్ పాల్గొన్నారు. వెంగళరావునగర్ టీ కొట్టులో బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట ముచ్చట కార్యక్రమంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్

ఓ వర్గం ఓట్ల కోసం అజారుద్దీన్‌కు మంత్రి పదవి

ఎర్రగడ్డ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఓ వర్గం ఓట్ల కోసం కాంగ్రెస్ అధిష్ఠానం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చిందని కేంద్ర మత్స్య పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఆరోపించారు. శుక్రవారం ఇందిరానగర్‌లో జరిగిన ముదిరాజ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింల బుజ్జగింపుతో కాంగ్రెస్ చేస్తున్న రాజకీయాలను ముదిరాజ్‌లు గమనించాలన్నారు. ఉపఎన్నిక బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూటీలు ఎప్పుడు ఇస్తారంటూ నిరసన



ఎర్రగడ్డలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, మహిళలు

ఎర్రగడ్డ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రెండు సంవత్సరాల క్రితం ఎన్నికల హామీల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థినులకు ఇస్తామన్న స్కూటీలు ఏమయ్యాయని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఎర్రగడ్డలో మహిళలు అధిక సంఖ్యలో తోపుడు బండిపై స్కూటీని ఉంచి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ విద్యార్థినికి స్కూటీలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం రెండేళ్లు గడచినా హామీని అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ హామీలేవీ అమలు జరగలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.సునీత తదితరులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ హన్మంతరావు, నాయకులు



బోరబండ బస్టాపు వద్ద మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగర్ కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి, కార్పొరేటర్ ఎం.డి.బాబా ఫసియుద్దీన్

వీర వనిత ఇందిరమ్మ



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి

బోరబండ/ఖైరతాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పించిన వీర వనిత ఇందిరమ్మ అని నాగర్ కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి అన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా బోరబండ బస్టాపు వద్ద కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్‌తో కలిసి ఆమె చిత్రపటానికి శుక్రవారం ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి సీనియర్ నేత మందుల సూర్యకిరణ్, బోరబండ డివిజన్ అధ్యక్షుడు బి.అశోక్, కార్యకర్తలు పాల్గొన్నారు. నెక్లెస్‌రోడ్ రోటరీ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మంత్రి అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ విజయారెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు నిరంజన్, మెట్టు సాయికుమార్, శ్రీకాంత్‌గౌడ్, టీపీసీసీ నేతలు మధుకర్ యాదవ్, కోట నీలిమ, ఎస్‌కె.షరీఫ్ నివాళులర్పించారు.

నిరుపేద బాలికకు అండగా సీఎం ప్రజావాణి

● చికిత్సకు రూ.9 లక్షలు మంజూరు



సౌమ్యకు ఆర్థిక సాయం మంజూరు పత్రాన్ని అందజేస్తున్న డా.చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్

బేగంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సీఎం ప్రజావాణి చొరవతో ఓ బాలికకు పునర్జన్మ లభించింది. ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలికకు సీఎం ప్రజావాణి అండగా నిలవడంతో పాటు చికిత్సకు అవసరమైన డబ్బులు మంజూరు చేయడంతో చికిత్స అనంతరం ఆ బాలిక పూర్తిగా కోలుకుంది. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా వెంకిర్యాల గ్రామానికి చెందిన ఈర్ల శ్రీనివాస్, అనురాధ కుమార్తె సౌమ్యకు కొంత కాలంగా తీవ్ర అనారోగ్యం నెలకొంది. పలు ఆస్పత్రుల్లో చూపించగా ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఇందుకు సుమారు. రూ.9 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. సన్నకారు రైతు అయిన శ్రీనివాస్‌కు అంత ఆర్థిక స్థోమత లేదు. దీంతో కుమార్తెను తీసుకుని రెండు నెలల క్రితం తల్లిదండ్రులు సీఎం ప్రజావాణికి వచ్చి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌ను కలిసి సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన చిన్నారెడ్డి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.4లక్షలు మంజూరు చేయడంతో పాటు సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టి(సెర్ప్) నుంచి మరో రూ.5లక్షలు ఆర్థిక సాయం చేశారు. ఇటీవల బెంగళూరు ఆస్పత్రిలో జరిగిన శస్త్ర చికిత్స విజయవంతమైంది. ప్రస్తుతం బాలిక పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉంది.

సీఎం ప్రజావాణికి 193 దరఖాస్తులు

మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన సీఎం ప్రజావాణికి మొత్తం 193 దరఖాస్తులు వచ్చాయి. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యదేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతోపాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి 42, రెవెన్యూకు 33, ఇందిరమ్మ ఇళ్ల కోసం 75, ప్రవాసి ప్రజావాణికి 3, ఇతర శాఖలకు చెందిన 40 దరఖాస్తులు వచ్చినట్లు అధికారి తెలిపారు.

చిరువ్యాపారులకు రుణాలిచ్చి ఆదుకోవాలి

ఖైరతాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ అధికారులు పేద చిరు వ్యాపారులకు చిన్నపాటి రుణాలిచ్చి ఆదుకోవాలని ఖైరతాబాద్ సర్కిల్ ఉప కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. సర్కిల్-17(ఖైరతాబాద్)కు చెందిన పలు బ్యాంక్‌ల మేనేజర్లు, అధికారులు, ఏఎంసీ మురళి, సర్కిల్ డీపీవో శ్రీనివాస్‌తో పాటు 16 మంది రిసోర్స్‌పర్సన్‌లతో శుక్రవారం సమావేశం జరిగింది. ఖైరతాబాద్ సర్కిల్‌లో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునేవారు, ఇంటింటికీ తిరుగుతూ వస్తువులు అమ్ముకునే వారు చిరు వ్యాపారులుగా నమోదు చేసుకోవాలని ఉప కమిషనర్ సూచించారు. సమావేశంలో బ్యాంక్ మేనేజర్లు నరసింహమూర్తి, నాగరాజు, కృష్ణమూర్తి, రాధాకృష్ణ, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



ర్యాలీలో విద్యార్థినులతో అధ్యాపకులు వెంకటేశ్వర్లు తదితరులు

జాతీయ సమైక్యతా దినోత్సవం

బేగంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ - ఎన్‌సీసీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సమైక్యతా దినోత్సవం జరిగింది. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో నిలిచిన విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి బహుమతులను అందజేశారు. అనంతరం కళాశాల నుంచి బేగంపేట ఫ్లైఓవర్ వరకు జరిగిన ర్యాలీలో విద్యార్థినులతో పాటు కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కబేళాలను మూసివేయాలి

పంజాగుట్ట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అక్రమంగా నిర్వహిస్తున్న కబేళాలను మూసివేయాలని, గోరక్ష చట్టాన్ని అమలు చేయాలని, గో రక్షకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని, వారికి రక్షణ కల్పించాలని గో రక్షా దళ్ అధ్యక్షుడు కాలుసింగ్, ప్రధాన కార్యదర్శి బి.పవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. సమావేశంలో రాము యాదవ్, హరీష్ యాదవ్, శ్రీకాంత్, నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ స్వీపర్‌పై అత్యాచారం

బోరబండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ స్వీపర్‌పై వాచ్‌మన్ అత్యాచారం చేశాడు. ఈ సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బల్కంపేటకు చెందిన జీహెచ్ఎంసీ కార్మికురాలు(50) శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో విధుల్లోకి చేరేందుకు ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి వద్ద రోడ్డు దాటేందుకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎక్కింది. మోడల్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ రాజు(45) బ్రిడ్జి మీద ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామితో ఎంపీ కిషన్‌రెడ్డి, ఎంవీఎస్‌ఎస్

విజయేంద్ర సరస్వతి స్వామిని దర్శించుకున్న ఎంపీ

పద్మారావునగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్‌లోని స్కందగిరి కంచిపీఠం శంకర, హనుమాన్ మందిర ఆలయ ప్రాంగణంలో ఉన్న కంచి పీఠాధిపతి శ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారిని శుక్రవారం కేంద్రమంత్రి జికిషన్‌రెడ్డి, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎంవీఎస్‌ఎస్ ప్రభాకరరావు దర్శించుకున్నారు.

అభయాంజనేయస్వామి 12వ వార్షికోత్సవాలు



అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేసిన ఆలయ చైర్మన్, మాజీ చైర్మన్ తదితరులు

బౌద్ధనగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నామాలగుండులోని వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన 48 అడుగుల అభయాంజనేయస్వామి 12వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. బీజేవైఎం నాయకుడు బన్సీలాల్‌పేట శ్రీనివాస్ సహకారంతో స్వామివారికి గజమాలను వేశారు. ఆలయచైర్మన్ చైర్మన్ డి.చందర్, మాజీ చైర్మన్ కాచం రాము, చంద్రమౌళి, అర్చకులు ప్రణవ్‌కుమార్, ప్రశాంత్ పంతులు, భక్తులు అభయాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా ఆలయ పునఃప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న కంచికామకోటి శంకరాచార్య శ్రీశంకర విజయేంద్ర సరస్వతి

బౌద్ధనగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి పద్మావతి గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం పునఃప్రారంభం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ముగ్గురు పీఠాధిపతుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేసి జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ కుంభాభిషేకాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలైన భక్తులు మూడేళ్ల తర్వాత మూలవిరాట్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దర్శించుకున్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి

కంచికామకోటి శంకరాచార్య శ్రీశంకర విజయేంద్ర సరస్వతి, పుష్పగిరి మహాసంస్థాన పీఠాధీశ్వరులు అభినవోద్దండ విద్యాశంకర భారతి, శ్రీమదుష్ట్రమల్లి పీఠాధీశ్వరులు త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వాములు ముఖ్యఅతిథులుగా హాజరై నూతనంగా నిర్మించిన ఆలయంలో స్వామివార్ల మూలవిరాట్‌లను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి కడకండ్ల రాజేశ్‌కుమార్, కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, తమ్మన వేణుగోపాలరావు, ప్రతినిధులు బాలసుబ్బారావు, ఆత్మారామ సూర్యసుబ్రమణ్యం, శివశంకరన్, నారాయణన్, సుజయ్‌ప్రకాశ్, శ్రీహరి, షణ్ముకరావు, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన వారికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న మజ్దూర్‌యూనియన్ ప్రతినిధి రామకృష్ణ తదితరులు

రైల్వేలో 79మందికి ఉద్యోగ విరమణ సత్కారం

చిలకలగూడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లో శుక్రవారం 79మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేశారు. రిటైరయిన వారికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతూ సికింద్రాబాద్‌లోని రైల్వే కార్యాలయాలు కోలాహలంగా మారాయి. హెడ్ క్వార్టర్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లతో పాటు లాలాగూడ వర్క్‌షాపులో వీరు పని చేశారు. రైల్ నిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రిటైరయిన వారికి రావాల్సిన గ్రాట్యూటీ, పీఎఫ్, లీవ్ శాలరీ వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తూ, వారికి అందే పెన్షన్ పత్రాలు అందజేశారు. అకౌంట్స్ విభాగంలో అసిస్టెంట్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ గుప్తా, సీనియర్ డీఏఎఫ్ బి. శ్రీనివాస రావు, సీనియర్ అకౌంటెట్లు బి. నవీనకుమార్, ఆశియా బేగంలకి జ్ఞాపికలు అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. దమరైల్వే మజ్దూర్ యూనియన్, అకౌంట్స్ బ్రాంచి కార్యదర్శి చింతకుంట రామకృష్ణ, ఎం.శ్రీనివాస రావు, యూనస్ మహమ్మద్ ఉద్యోగ విరమణ చేసిన వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.



సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జంపన ప్రతాప్ తదితరులు



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసిన భానుక నర్మద



దివంగత నేత సర్దార్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్, దేవులపల్లి శ్రీనివాస్, శ్యాంరెడ్డి తదితరులు

ఘనంగా పటేల్ జయంతి వేడుకలు

సికింద్రాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు లష్కర్‌లో శుక్రవారం ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్వచ్ఛంద, సేవా సంస్థల ప్రతినిధులు సర్దార్ పటేల్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోయినపల్లి సెంటర్ పాయింట్ వద్ద సెంటర్ పాయింట్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, మల్లెల విశ్వనాథ్, మద్ది బాస్కర్‌రెడ్డి, తులసి ప్రకాష్‌రావు, శరత్, నరహరి, అజార్, భైరాం, కృష్ణ, కరణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కంటోన్మెంట్ బొల్లారంలో..

తిరుమలగిరి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భారత తొలి ఉప ప్రధాని హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు కంటోన్మెంట్ బొల్లారంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆస్పత్రిలో ఘనంగా జరిగాయి. కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు భానుక మల్లికార్జున్, ధనంజయ చారి, వార్డు 8 అధ్యక్షుడు పింజర్ల ప్రదీప్ కుమార్, బీసెన్ శ్రీనివాస్, వార్డు 6 బీజేపీ అధ్యక్షుడు ప్రతీక్ జైన్, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిలకలగూడ బీజేపీ కార్యాలయం ముందు సర్దార్ పటేల్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బీజేపీ నాయకుడు వ్యాకల చంద్రశేఖర రావు తదితరులు



బోయిగూడలో ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కోట నీలిమ



పికెట్‌లో దివంగత ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగిరు అనంద్‌బాబుగౌడ్, వైస్ చైర్మన్ డి.వి.దేవేందర్

సంక్షేమ పథకాలకు ఆద్యురాలు ఇందిరాగాంధీ

పద్మారావునగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గరీబీ హటావో నినాదంతో దేశంలోని పేదల ఆకలి తీర్చిన మనత స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీకే దక్కుతుందని పీసీసీ



ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. బోయగూడలో నిర్వహించిన దివంగత ఇందిరా గాంధీ వర్ధంతి కార్యక్రమానికి హాజరై విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతి కోసం 20 సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆమెకు దక్కుతుందని అన్నారు. భూమి లేని నిరుపేదలకు భూములు పంచిన గొప్ప నాయకురాలిగా వర్ణించారు. కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌రావు, డి.శ్రీనివాస్, పాండుగౌడ్, హరి, ఎంపీ సునీల్, దా.శివకుమార్‌లాల్, వేద్‌ప్రకాశ్, ఎంఎం రాజు, శంకర్, మల్లేశ్, మల్లా రమేశ్ పాల్గొన్నారు.

అడ్డగుట్టలో..

అడ్డగుట్ట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానమంత్రి, దివంగత ఇందిరాగాంధీ వర్ధంతి వేడుకలను శుక్రవారం అడ్డగుట్టలో నిర్వహించారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ ఆదేశాల మేరకు అడ్డగుట్ట తుకారాంగేట్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు గంట రాజుసాగర్, జావర్, కొమరమ్మ, సుదర్శన్, డివిజన్ మహిళాధ్యక్షురాలు వరలక్ష్మి తదితరులు ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్మశాన వాటికలో వసతుల కల్పనకు కృషి : తలసాని

పద్మారావునగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మరణించిన వ్యక్తికి సంప్రదాయబద్ధంగా అంతిమ వీడ్కోలు పలికే ప్రదేశమే శ్మశాన వాటిక అని మాజీమంత్రి, సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం బన్సీలాల్‌పేట్, బోయగూడలోని క్రైస్తవ శ్మశాన వాటికలో నవంబరు 2వ తేదీన నిర్వహించే ఆల్ సోల్స్‌డే ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మతాలకు చెందిన శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు, వసతులు, అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంతిమ వీడ్కోలు పలికేందుకు వచ్చే వారు సైతం ఎలాంటి ఇబ్బందులకు గురి కావద్దన్నది తన ఆలోచనగా చెప్పారు. బోయగూడ గ్రేవ్ యార్డు అభివృద్ధికి కోటి రూపాయలను మంజూరు చేయించి ప్రహరీ, రోడ్డు నిర్మాణం, డీసీలు ఏర్పాట్ల పనులకు వినియోగించినట్లు తెలిపారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలతో



క్రైస్తవ మత పెద్దలతో తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ హేమలత

ఆయనను ఆశీర్వదించారు. కార్పొరేటర్ కుర్మ హేమలత, పద్మారావునగర్ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, వెంకటేశన్ రాజు, పాదర్లు ఆరోగ్యం జయరాజ్, ప్రతాప్, వినోద్, మార్తి, రావిన్సన్, ఆనంద్, హేనిస్ టార్చ్, సిస్టర్ ఆక్సిలియన్, నిర్మల, నాయకులు ఏసూరి మహేశ్, లక్ష్మీపతి, రమణ, క్రిస్టియన్ నాయకులు ప్రశాంత్, విజయ్, శామ్యూల్‌లు పాల్గొన్నారు.

నేటినుంచి బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవాలు

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి 150వ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు స్టాండింగ్ కమిటీ, జూబ్లీ స్టీరింగ్ కమిటీ చైర్మన్ రాబర్ట్ సూర్య ప్రకాశ్ తెలిపారు. శుక్రవారం చర్చిలో సీనియర్ పాస్టర్ డాక్టర్ ఎం పురుషోత్తం, ప్రెసిడెంట్ రెవరెండ్ జెండిక్ క్రాలిస్టర్‌లతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. 1875లో బాప్టిస్ట్ మిషన్‌కు చెందిన రెవరెండ్ డబ్ల్యూడబ్ల్యు క్యాంప్‌బెల్, ఆయన సతీమణి లిడియాలు ఈ చర్చిని స్థాపించినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక బోధనతో పాటు ఉచిత విద్య, వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. నవంబరు 1వ తేదీన ప్రారంభంతో మొదలయ్యే ఉత్సవాలు 8వ తేదీన ఫ్యామిలీ కార్నివాల్, 13న మిషన్ ఫెస్టివల్, 14వ తేదీన ప్రధాన ఉత్సవం, 15వ తేదీన మ్యూజిక్ కన్సర్ట్, 16వ తేదీన మిషన్ డే,



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న చర్చి ప్రతినిధులు

17, 18న రివైవల్ మీటింగ్, 22న వరల్డ్ పైడ్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి అద్దూరి లక్ష్మణ్‌ను ఆహ్వానించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో పాస్టర్ చార్లెస్ డియోడర్, ప్రతినిధులు సత్యరాజ్‌నవంగూరి ఎలియా, ఎలీషా, జామ పాల్, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల అదుపులో లైన్‌మన్

- విద్యుత్ మీటర్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు



రాములు (ఫైల్), లైన్‌మెన్

తిరుమలగిరి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా విద్యుత్ మీటర్లు అమ్ముకుంటున్న లైన్‌మన్‌ను విజిలెన్స్ అధికారులు పట్టుకుని విచారణ చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలగిరి లాల్‌బజార్‌లో లైన్‌మన్ రాములు ఆఫీసర్స్ కాలనీలో ఓ భవనానికి విద్యుత్ మీటర్లు ఇప్పిస్తానని రూ.90వేలు వసూలు చేశారు. భవనం నిర్మాణంలో ఉన్నప్పుడు రూ.40వేలు యజమాని వద్ద అడ్వాన్స్ తీసుకున్నారు. మరో 40వేల రూపాయలు భవన యజమాని అన్నపూర్ణ, ప్రశాంత్‌లను ఒత్తిడి చేసి మరో రూ.40వేలు ఫోన్‌పే ద్వారా పొందారు. కేవలం రెండు మీటర్లు బిగించి మిగతా రెండు మీటర్ల కనెక్షన్ ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. భవన యజమానులు గట్టిగా నిలదీయడంతో రాములు పారిపోయాడు. దీంతో భవన యజమాని అన్నపూర్ణ, ప్రశాంత్ శుక్రవారం లిఖితపూర్వకంగా డివిజనల్ ఇంజనీర్‌కు వినతిపత్రం ఇచ్చారు. విషయం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు లైన్‌మెన్ రామును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రేతల అరెస్ట్

రెండు కేసుల్లో 1.25 కిలోల గంజాయి స్వాధీనం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు అరెస్ట్ చేసి, వారి నుంచి 1.25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ సిక్ విలేజ్ ప్రాంతానికి చెందిన సోహైల్ గంజాయి విక్రయాలు చేస్తున్నాడన్న సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బీ టీమ్ సీఐ బిక్షారెడ్డి, ఎస్సై బాలరాజు, సిబ్బందితో కలిసి నిఘా పెట్టారు. సిక్ విలేజ్ ప్రాంతంలో గంజాయి సరఫరా చేయడానికి స్కూటీపై వచ్చిన సోహైల్‌ను అరెస్ట్ చేశారు. అతడి నుంచి 200 ప్యాకెట్లలో నింపి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 880 గ్రాముల గంజాయి, స్కూటీ, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఉప్పల్‌లో నలుగురు..

రవితేజ, జగదీశ్వర్, దిలీప్, చరణ్‌లు కలిసి ఉప్పల్ ప్రాంతంలో గంజాయి విక్రయాలు చేస్తున్నారు. ఉప్పల్ విజయపురి కాలనీ ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారం మేరకు రంగంలోకి దిగిన ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సిబ్బంది నలుగురు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశారు. వారి నుంచి 325 గ్రాముల గంజాయి, రెండు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణకు ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

జాతీయ సమైక్యతా దినోత్సవం

బేగంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ - ఎన్‌సీసీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సమైక్యతా దినోత్సవం జరిపింది. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో నిలిచిన విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి బహుమతులను అందజేశారు. అనంతరం కళాశాల నుంచి బేగంపేట ప్లైఓవర్ వరకు జరిగిన ర్యాలీలో విద్యార్థినులతో పాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైమ్ సమాచారం

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం



నందిని

బౌద్ధనగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై అంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం వారాసిగూడ బ్రాహ్మణబస్తీకి చెందిన కందకాల నందిని(17) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుంది. కాలేజీలో నందిని గొడవలకు పాల్పడడంతో అధ్యాపకులు ఫోన్ చేసి నందిని తల్లితండ్రులను కౌన్సెలింగ్ రావాలని చెప్పారు. అక్టోబరు 25న తల్లి గీత కుమార్తెను కాలేజీకి తీసుకువెళ్లి తిరిగి ఇంటికి తీసుకువస్తూ మందలించింది. సాయంత్రం ఆరుగంటలకు ఇంటికి చేరుకున్న తర్వాత తల్లి వాష్‌రూమ్‌కి వెళ్లి వచ్చేసరికి కుమార్తె నందిని కనిపించలేదు. పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. దీంతో తన కుమార్తె కనిపించటం లేదని గురువారం రాత్రి తల్లి గీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీ ఆస్పత్రి నుంచి మహిళ..



మమత

బౌద్ధనగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి నుంచి ఓ లేడీ సహాయకురాలు అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడపల్లి సాయినగర్ కాలనీకి చెందిన బొల్లెపల్లి వినోద్‌కుమార్ అనారోగ్యంతో అక్టోబరు 24న గాంధీ ఆస్పత్రిలో చేరాడు. వినోద్‌కుమార్‌కు సహాయకురాలిగా భార్య మమత(33) ఉంది. భార్యాభర్తల మధ్య చిన్న తగాదా పొడ చేసుకోవడంతో సెల్‌ఫోన్‌ను భర్తకు ఇచ్చి ఆస్పత్రి నుంచి ఆమె వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో మరిది అనిల్‌కుమార్ మా వదిన కనిపించటం లేదని గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును నమోదు చేసుకున్నారు.

తల్లి మందలించడంతో కుమారుడు..



ప్రణీత్

బౌద్ధనగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో కుమారుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునీత తెలిపిన వివరాల ప్రకారం వారాసిగూడ బౌద్ధనగర్‌కు చెందిన కందుకూరి ప్రణీత్(15) బాగ్‌లింగంపల్లిలో ఓ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రతిరోజూ ప్రణీత్ ఇంటి నుంచి కాలేజీకి వెళ్లి తిరిగి వచ్చేవాడు. నాలుగురోజులు నుంచి కాలేజీకి రావటంలేదని అధ్యాపకులు ప్రణీత్ తల్లికి ఫోన్‌చేసి చెప్పారు. ఇంటికి వచ్చిన ప్రణీత్‌ను తల్లి రేఖారాణి మందలించడంతో 27న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ప్రణీత్ కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవటంతో గురువారం రాత్రి తల్లి తన కుమారుడు కనిపించటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ చౌరస్తా యమ డేంజర్

- లకడావాలా చౌరస్తాలో సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి
- గజిబిజి రాకపోకలతో ఇబ్బందులు
- అధికారులు స్పందించాలి



చౌరస్తా వద్ద గజిబిజిగా వెళుతున్న వాహనాలు

తిరుమలగిరి అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బొల్లారం ఆయ్యప్ప దేవాలయం సమీపంలోని లకడావాలా చౌరస్తా ప్రమాదకరంగా మారింది. రాజీవ్ రహదారిలో ఉన్న చౌరస్తా నుంచి అటు బొల్లారం ఇటు ఈఎంఈ సెంటర్‌తో పాటు ఉత్తర తెలంగాణకు 24గంటలు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బొల్లారం డౌటన్ బజార్, ఈఎంఈ సెంటర్ లోపలికి వెళ్లాల్సిన వాహనదారులు ఈ చౌరస్తా నుంచే వెళ్లాలి. ఇక్కడ సిగ్నల్స్ ఏర్పాటు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, పాదచారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట, కరీంనగర్, పరిసర ప్రాంతాల నుంచి వాహనాలు ఈ దారి నుంచే వెళుతుంటాయి. చౌరస్తా వద్ద వాహనాలు వేగంగా వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతాయని ఆస్కారం ఉందని పలువురు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈఎంఈ సెంటర్ లోపలికి వాహనాలు రాకపోకలు సాగించకుండా రక్షణశాఖ అధికారులు గోడ కట్టి మూసివేశారు. దీంతో ప్రమాదాలు తగ్గాయి. చౌరస్తా నాలుగు వైపుల నుంచి వాహనాలు వెళుతున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు, నేషనల్ హైవే అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో సిగ్నల్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



కరీంనగర్, సిద్దిపేట, మంచిర్యాల, పెద్దపల్లి, వేములవాడ ప్రాంతాల నుంచి వాహనాలు 24 గంటలు రాకపోకలు కొనసాగిస్తూనే ఉంటాయి. బొల్లారం లకడావాలా చౌరస్తా వద్దకు రాగానే బొల్లారం డౌటన్‌బజార్‌కు వెళ్లే వాహనాలు ఈఎంఈ సెంటర్ లోకి వెళ్లే వాహనాలతో చౌరస్తా గజిబిజిగా మారుతుండటంతో ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన ఉంది. ప్రాణనష్టం జరగకుండా ముందుగానే అధికారులు స్పందించి సిగ్నల్‌ను ఏర్పాటు చేయాలి.

- రాజారెడ్డి, స్థానికుడు

ట్రాఫిక్ పోలీసులు నియమించండి



ఈ చౌరస్తా వాహనాల రాకపోకలతో బిజీగా మారడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దగ్గరలోనే అయ్యప్పస్వామి, అంజనేయస్వామి దేవాలయం ఉండడంతో ఉదయం, సాయంత్రం ఆలయాలకు భక్తులు అధికంగా దర్శించుకోవడానికి వస్తుంటారు. ప్రమాదాలు జరగకుండా సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి, లేదా ట్రాఫిక్ పోలీసులను నియమించాల్సి.

- ఉమేష్, స్థానికుడు